కాశీభట్ల వేణుగోపాల్

# దిగంతం



కాశీభట్ల వేణుగోపాల్

# దిగంతం

**DIGANTAM** *(A Noverl)*
by KASIBHATLA VENUGOPAL

First Edition : February 2003
Second Edition : May 2013

© Author

*Published by :*
**AKSHARAM PRACHURANALU**
87I1345-10, Nandyal Checkpost
Kurnool - 2
Cell : 95500 79473

*For Online Purchases & e Book*

Kinige *www.kinige.com*

*Printed at*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
Cell : 9490 634849

₹ : **80**

## అంకితం

చావకే అన్నా....
వినకుండా చచ్చిపోయిన
అమ్మకు.....

– వేణు

# ముందుగా...

వ్యక్తి ఏకాకి. వాడి అనుబంధాలు, అనుభూతులు, ఖేదాలు, వినోదాలు వాడికి సంబంధించినవే.... వాడి జీవితంలోని లుప్తానుభూతులకి, లబ్ధానుభూతులకీ ప్రపంచానికి సంబంధం లేదు... చాలా మటుకు గమనించదు కూడాను...కొండొకచో గమనించినా కేవలం ప్రేక్షకపాత్ర మాత్రమే అది... అయితే సంఘం ఏమిటి?... సాంఘికం ఏమిటి? నైమిత్తికంగా ఒకళ్ళమీదింకొకళ్ళు ఆధారపడ్డం... ఇది కఠోరంగా ఉండొచ్చు.... వాస్తవమెప్పుడు కఠోరమే.... 'నేనున్నంతవరకే ఈ నా ప్రపంచం' (సార్త్ర్)... ఆవిధంగా కొన్ని కోట్ల ప్రపంచాలు ఈ లోకంలో... దైనందిన జీవితంలో జీవనం కోసం చేసే మోసాలూ, ద్రోహాలూ, సహాయాలూ అన్నీ.... అన్నీ సాపేక్షాలే...

మనం ప్రేమ అనుకుంటున్నది మన స్వార్థం... ప్రేమ కోసం ఏమైనా చేయగలమని చెప్పుకునేది 'నా కోసం నేనేమైనా చేయగల్ను' అని చెప్పుకోవడమే.... మన ఆలోచనలు మనల్ని నిర్మిస్తాయి.... 'నేను' – 'నా' అన్న భావన ప్రాకృతికంగా, సహజాతంగా మనకుంటుంది. ప్రాణప్రదం అన్నమాటకి, ప్రాణం అన్నం మాటకి మధ్య సన్నటి, పల్చటి గీత ఒకటుంటుంది.... ప్రాణప్రదమైనదో, వ్యక్తో నశించినంత మాత్రాన ప్రాణాలుపోవు... ఇది సర్వే సర్వత్రా నిరూపితం... కాబట్టి 'నేను' అన్నది ఈ ప్రపంచ అస్తిత్వానికి పునాది... ఒకానొక శాస్త్రజ్ఞుడు ఒక గొప్ప విషయాన్నో, వస్తువునో కనుగొన్నాడనుకుందాం... అది... 'సర్వేజనా సుఖినోభవంతు' అంటూ చేసాడనుకుంటే పొరపాటే... 'నేను కనుగొన్నాను' అన్న అనుభూతే ప్రధానం... (దీన్ని మనం చాలా విషయాల్లో చూడొచ్చు.... ముందు మానవాళి సౌఖ్యానికి అనుకున్న గొప్ప గొప్ప ప్రయోగాలు మానవాళి నాశన హేతువులవు తున్నాయి) ఇక్కడ ఈ నవలలో నేను చెప్పదలచుకున్న విషయం ఒక్కటే... 'నేను' ప్రధానం... తతిమ్మా సంబంధాలన్నీ మన జీవితపు బండి నడవడానికుపకరించేవే...

'నేను' – 'జీవితం' రెండూ ఒకటేననుకుంటే ఈ నవలలో రెండు ఎప్పటికి కలవని పాత్రల ద్వారా నాయకుడి జీవితపు బండి దొర్లిపోతుంది... ఆ రెండు దాదాపు ఒకే సమయంలో ఆగిపోతే నాయకుడి జీవితపు బండి ఆగిపోతుందా? ఈ ప్రశ్నను పాఠకులకి వదిలేసి ఆపేసాను.. ప్రతి సంబంధం దిగంతం లాంటిదే... అదో నిరంతర భ్రమ అని చెప్తూ...

నన్ను (రచయితని) వ్యక్తిగతంగా ప్రశ్నిస్తే ఆ రెండు పాత్రలు ఆగినంత మాత్రాన నాయకుడి జీవితపు బండి ఆగిపోదు అని ఖచ్చితంగా చెపుతాను.. ఒకానొక పాత్రకు ప్రత్యామ్నాయాన్ని సూచించాను కూడా... ఎలా అంటే రైలు బద్దీ వేలమైళు ఉన్నా అది ముక్కలు ముక్కలుగా అతికించిందే అవుతుంది... ఒక సహారా నుంచి ఇంకో సహారాకు మనం బదిలీ అయినట్లు... అందుకే ఆద్యంతం నవలలో రైలుబద్దీల ప్రస్తావన తీసుకొచ్చాను... దయ ఉంచి గమనించగలరు.... మన ప్రపంచం, మన జీవితం మన వైయక్తికానుభూతులే... మన మన ప్రపంచాల అస్తిత్వం మనకు మాత్రమే... మన ప్రపంచం మన ప్రాణప్రదమైన వ్యక్తుల ప్రపంచం రెండూ వేరు వేరు... ఈ విషయాన్ని కొద్దిపాటి కంగాళీతో మేళవించి కొంత హాస్యాన్ని జోడించి 'నేను' చెప్పగలిగినట్టు 'నా' దైన శైలిలో చెప్పాను... అవధరించ ప్రార్థన...

**– కాశీభట్ల వేణుగోపాల్**

## కృతజ్ఞతలు

దీన్ని అనుబంధం నవలగా ప్రచురించిన స్వాతి బలరామ్ గారికి, చంద్రగారికి, 'రచన' శాయి గారికి, ప్రూఫులు దిద్దిన అబ్బాయి శాస్త్రుర్లికి, సహృదయుడు చలంకి, అక్కయ్యలు జయలక్ష్మి, సావిత్రిలకి, ఎందరో మహానుభావులు అందరికీ.....

– వేణు

**జాతస్యహి ధ్రువో మృత్యుః**

– భగవద్గీత

*For what is to die but to stand naked in the wind and to melt into the sun?*
*And what is it to cease breathing but to free the breath from its restless tides, that it may rise and expand.*

*- KAHLIL GIBRAN*

# దిగంతం

ఏ ముఖమూ లేని నేను నా  ముందు పరిగెత్తుతున్నాను. ముఖమే లేని యింకో నేను.... నన్నే తరుముకుంటున్నాను.

ముందు పరుగెత్తే నేనూ....

వెనక తరిమే మరో నేనూ....

నా నేనులు వేటాడేదీ వెంటాడ్తోన్నదీ, గాలిస్తున్నదీ....

ఎక్కడో కోర్కెల దొమ్మీలో.... ఏవో ఆశల తొక్కిసలాటలో

పారేసుకున్న ముఖాన్నే....

మనిషి ముఖాన్నే....

ఎంతకీ దొరకదా ముఖం....

ఎక్కడో దూరంగా దిగంతం దగ్గర లీలగా కనీ కనబడకా....

మభ్య పెడ్తుంది...

అలా.... అలా....

అనేకమైన నేనులుగా చీలిపోయి, చిట్లిపోయి, చెదిరిపోయి నిజముఖ లాలసతో పరిగెడుతూ.. పరిగెడ్తూ.... అలసిపోయి... ఉన్నట్టుంది మెట్లు;

ఎక్కుతున్నాను... ఎక్కుతున్నాను... ఎక్కుతూనే వున్నాను...

యెంతకీ మెట్లు మాయం కావు...

అలుపొచ్చేస్తోంది...

చెమటలు కారిపోతున్నాయి.

సహస్ర బాహువుల్తో చెమట తుడుచుకుంటూ... మెట్లు

ఎక్కుతూనే వున్నాను...

ఏవో తెలీని ఎత్తులకెళ్లిపోతున్నాను...

పైకి.... యింకా యింకా ఎత్తులకు....

కిందికి చూస్తే కళ్ళు తిరుగుతున్నాయి...

కాళ్ళు పట్టు తప్పిపోయాయి....

మెట్ల మీంచి జారిపోయాను...

పడుతున్నాను... ఏవో అగాధాల్లోకి... అడుగు తెలీని అగాధం లోకి....

పడుతూనే వున్నాను... పడుతూనే వున్నాను...

దభ్మని... ధనాల్మని

ఉలిక్కిపడి లేచాను...

"ఏయ్ దొంగలంజా! ముగ్గరం ముందుగాల్నించే యీడ బిందెలేస్కోని కూసోనుంటే మజ్జెలేకి సొరబడ్తా?

ఫోఁ... కుంటి లంజా!"

లేచి కూచున్నాను....

ధనాల్మని చప్పుడు...

తలుపు వారగా వచ్చిపడిన అల్యూమినియం దేగిశా వూగుతోంది...

'టుకూ...టుకూ... మని శబ్దం చేస్తూ....

ఒళ్ళంతా చమటలు పట్టి ఉన్నై, లేచి జారిపోయిన లుంగీని కట్టుకుని మెల్లిగా వచ్చి బైటికి తొంగిచూశా.

బైట యింకా చెదురుమదురుగా చీకట్లు... మసక మసకగా వుంది. నాకు నలభై రెండేళ్ళుగా పరిచయమైన నీడ కుడికాలు యీడ్చుకుంటూ నా వైపుకే కదిలొస్తోంది.

"ఫో... మూకిలంజా... మల్లా యీడకెల్లొచ్చినావంటే కాల్లించుతా నీయమ్మ..." వెనకాల వెలగని వీధి దీప స్తంభానికి పక్కనున్న మున్సిపల్ నల్లా దగ్గర్నుంచీ వినిపించింది.

కాలీడ్చుకుంటూ వచ్చిన నీడ వంగి అల్యూమినియం దేగిశాని తీసుకుని మళ్ళీ కాలీడ్చుకుంటూ వెనక్కే వెళ్తోంది.

నాకు తెల్సు ఈ ప్రపంచంలో ఈ కుంటి ముసిలి మూగిదాన్ని యెవరూ అది చేయాలనుకున్న పనినాపలేరని.

గబగబా వెళ్ళి చెయ్యి పట్టుకున్నా 'పద' అన్నట్లు యింట్లోకి తర్జని చూపించా.

అవిటి కాలిమీదున్న చేత్తో నా చేతిని తప్పించి మళ్ళీ కదిలింది ఆ ముసలిది.

'ఛ... మళ్ళీ ఉదయాన్నే సూర్యుడు కూడా పొడవకుండానే జుగుప్సాకరమైన మాటల్ని వినాల్సొస్తుంది. పరోక్షంగా పడనూపడాల్సొస్తుంది. కోపం జ్ఞానాన్ని తొక్కి ముందుకు పోయింది. సరసరా ముందుకు రెండడుగులు వేసి ఆ అల్యూమినియం డేగిశాని బరుక్కున గుంజుకుని దాదాపు పరుగులాంటి నడకతో ఇంట్లో లోపలికొచ్చా. లోపలికొచ్చి కోపంగా ఆ గిన్నెని తలుపు మూలకి గట్టిగా కుక్కాను. ఆ విసురుకు ఆ మూల్లో వున్న మొండిపరక చెయ్యి మీద పడింది.

కోపం యింకా ఎక్కువైంది.

తెరచి వున్న తలుపుకు అడ్డంగా నీడపడింది. నాకు నలభై రెండేళ్ళుగా తెలిసిన నీడ... నా కన్నం పెట్టిన నీడ... కుండి నీడ.... నన్ను కన్న నీడ... మూగినీడ.... నిశ్శబ్దంగా లాలిపాడిన నీడ... ముసలినీడ... పాడైపోయిన నీడ... ఆడ నీడ... అమ్మ నీడ...

నాకున్న ఒక్క తోడు ఒకే ఒక్క తోడు ఆ నీడ!

మళ్ళీ వంగి ఆ అల్యూమినియం డేగిశాని తీసుకుని కాలీడ్చుకుంటూ... కుంటుకుంటూ కొళాయి వైపుకు కదిలింది.

నాకు ఖచ్చితంగా తెల్సు ఆ డేగిశాడు నీళ్ళు పట్టుకునే తీరుతుంది ముసిల్ది.

ఒక్కసారి నిస్సత్తువ ఆవరించింది ఒళ్ళంతా. నెమ్మదిగా కదిలొచ్చి చాప మీద కూలబడ్డా, కూలబడి దిండు కింద తడిమా...

చేతికి ఏ మాత్రం స్నేహం లేకుండా కరుకుగా ఖాళీగా తగిలింది బీడీ కాగితం.

కోపమింకా యెక్కువైంది!

కసిగా దాన్ని బైటికి తీసి బాగా నులిమి వుండచేసి బలంగా బైటికి విసిరా గుమ్మానికి కొట్టుకుని ఆ వుండ యెగిరొచ్చి మళ్లీ నా ముందే పడి దొర్లింది... దొళు ్లతూ నన్ను చూసి వెకిలిగా నవ్వుతున్నట్లనిపించింది...

కోపం! నసాళానికంటింది!

ఆ వుండ వేపు తీక్ష్ణంగా చూశా.

చిన్ని వుండ... యెర్ర కాయితపు బీడీ కాయితపు వుండ. చిన్న చిన్న మడతల్తో చిన్న గోళీ సైజు వుండ.

ఠక్కున కల గుర్తొచ్చింది... కలలోని నా ఖాళీ మొహం గుర్తొచ్చింది... నేను వెదుకుతున్న మొహం... నా ముఖం... దుర్భిణిని తిప్పి వెనకనుంచీ చూస్తే కన్పించినట్లు చిన్నగా అయిన నా మొహం.. ముడతల వుండ ముఖం... కాయితపు మొఖం వుండ... బీడీ కాయితపు వుండ... నా ముఖం...

దొరికింది దొరికింది నా ముఖ శకలం... దీన్ని తీసి అతికించడానికి నేను మళ్ళీ నా కలలోకి వెళ్ళాలి.

జాగృతికి సుషుప్తికీ మధ్య వైరుధ్య సాపేక్షత!

మహాద్భుతమైన చిరునవ్వు నా మొహమ్మీద చిగురించింది. సగటు మనిషి నవ్వాడు ఓ చిర్నవ్వు.

కోపం తగ్గిపోయింది.

* * *

లేచి గోడకు తగిలించిన చొక్కా తీసా... చాక్కా కంటే ముందుగా మేకుకు వేలాడ్తోన్న క్యాలెండరు గడిచిపోయిన నెలలోని తారీఖుల్ని అలక్ష్యంగా చూపుతోంది.

దానివేపు నిర్వికారంగా చూసి, ఖాళీ చొక్కాలోకి సగం దూరి బైటికి పూర్తిగా వచ్చేశా.

బైట కొళాయి దగ్గర గుంపుగా వుంది.

స్ట్రీట్ లైట్ స్తంభానికి కట్టిన చిన్ని కట్టకు చవిటి పిర్ర ఆనించి అవిటికాలు నిక్కజాపి కూచునీ నిలబడీ అటుయిటూ కాకుండా... తాను చేయని తప్పుకు అరవై యేళ్ళ శిక్ష అన్నట్లు గోడకుర్చీ వేసినట్టు కనిపించింది అమ్మ...

కొళాయి దగ్గర్నించీ సాగిన బిందెల బకెట్ల గిన్నెల డబ్బాల క్యూలో చాలా పొగరుగా, దర్పంగా, మొండిగా కనిపించింది అల్యూమినియం డేగిశా అమ్మలాగా...

ఈ ముసలి కుంటి మూగి ముండకున్న తెగువ ధైర్యం నాకెందుకు రాలేదో నాకర్థం కాదు... బహుశాః యింకోవేపు మనస్థైర్యం అబ్బి వుంటుంది. వద్దు వద్దు ఛఁ...ఛఁ... అసలు అటు వేపుకే ఆలోచన వెళ్ళకూడదు.

పాయిఖానా పరిమళం గుప్పున కొట్టింది.

రోడ్డంతా రొచ్చురొచ్చుగా వుంది.

అసలు సగం పాయిఖానా రోడ్డు మీదే వుంది, పిల్లల్తో అసలు రోడ్డెక్కడేడ్చిందనీ!

గుఱ్రుగుఱ్రుమనే సూకరాలూ.... ఇళ్ళచూరుల్లోంచీ పైకిలేచి రకరకాల ఆకారాల వళ్ళు విరుచుకుంటూన్న పొగలూ... సఱ్రుసఱ్రుమని యెప్పటికీ పోని దుమ్మని వూడుస్తూ ఆడవాళ్లూ.... ప్రపపంచంలోని దరిద్రం ఘనీభవించి యిక్కడ ప్రత్యక్షమైందేమో నన్నట్టు!

ఛఛఛఛాఁ..... మారాలి... యిల్ల కొంచెం డీసెంటుగుండే లొకాల్టీకి మార్చాలి.

ఒక్కసారి ఫ్యాక్టరీ క్వార్టర్స్ గుర్తొచ్చాయ్.

కసుక్కున కత్తితో కోసినట్లైంది గుండెల్లో....

పొడుగాటి యూకలిప్టస్ చెట్లతో పక్కన గుట్టమీద ఆంజనేయస్వామి గుడితో... ఊరికి దూరంగా ప్రశాంతంగా హాయిగా స్వచ్ఛంగా... ప్చ్... పదేళ్ళైపోయింది. యిది పదకొండోయేడు ఫ్యాక్టరీ మూసి....

యిపుడన్నారు అపుడన్నారు... రేపన్నారు....?

ఈ సంవత్సరంలో ఖచ్చితంగా తెరుస్తామన్నారు. ఈ మానేజిమెంటు కాదు. గుజరాత్ కంపెనీట. అక్కడివాళ్లు తీసేసుకున్నారట పాతవాళ్ళతోటే మళ్ళీ ఫ్యాక్టరీ నడిపిస్తారట. అలా అలా అంటూ... అంటూ....

కదలీకదలీ...

ఫ్యాక్టరీ టైం ఆఫీసు సీనియర్ క్లర్క్నైన నేను.... యిప్పుడు 'పద్మజా పబ్లిషర్స్'లో సేల్స్‌మన్ కమ్ గుమస్తా కమ్ నౌకర్.... కమ్... ఎవ్రీథింగ్గాణ్ణై...!

ఈ మురికి కూపంలో నూటడెబ్భై రూపాయల అద్దెతో నా కుంటి మూగి ముసలి తల్లితో....

ఫక్... ! ఆరేళ్లుగా మగ్గుతున్నాను... నేనివ్వగలిగిన అద్దెకు యింతకంటే మంచికొంప దొరకదు.

కొంప... కొంపేం కొంప... ఒక్క గది... గది పక్క రెండుసిమెంటు రేకుల్తో వార వేసుందంతే! సిమెంటు రేకుల్కింద పొయ్యి... అక్కడే స్నానం... పాయిఖానా మాత్రం పబ్లిక్కే.

చేరిన కొత్తల్లో సిగ్గుతో చితికి ఛిద్రాలై పొయ్యేవాణ్ణి. కానీ యేం చేయగలం. అవసరం అన్నిట్నీ అధిగమింపచేస్తుంది. యిప్పుడు నిర్లజ్జగా యెవడేనా వెళ్తోంటే వాణ్ణి తోసి మరీ దూరగలను పాయిఖానాలోకి.

ప్చ్.... కాలం!

సాయిబాబా బంకులోంచీ స్యాండల్‌వుడ్ బత్తీ ఘుబాళిస్తోంది. బంకు ముందు స్టూల్మీద మూడుక్రేట్లతో పాలప్యాకెట్లున్నాయి. నానా గందరగోళంగా అయ్యప్ప భక్తిగీతాల రొద... సాయిబాబా బంకులోంచే!

పక్కవీధినించీ వచ్చే ఆవిడ పాలప్యాకెట్ కొని హొయలుగా నడుస్తూ పోతోంది. ఆమె పృష్ఠభాగం నా వేపుకుంది. ఆమెకి యెదురుగా సూర్యుడు... సూర్యకాంతి ఆమె మీద పడి ఆమెలోంచీ నన్ను చేరుతోంది. పల్చటి మాక్సీలోంచీ సూర్యకాంతి దత్తమైన ఆడనీడ సౌందర్య శోభకు గుండె గునగునామంటుంటే... తప్పుతప్పని నలభై రెండేళ్ళ బ్రహ్మచారి నాలుకకొరుక్కుంటున్నాడు.

నరాలు జివ్వుమన్నాయి. ప్రాకృతిక లిప్సల చెల్లింపుకు యెందుకింత కష్టపడాలి?

నిజమే... ఆకలేయంగానే అలా అలవోకగా అన్నం తినేయలేంగా! దాన్ని సంపాదించుకోవాలి.

ఒక్క నిద్రమాత్రం ఎక్కడేనా పోవచ్చు.

మళ్లీ ఒకటీ రెండులకూ కష్టమే.

సభ్యాసభ్యతలు...!

సాయిబాబా బంకు ముందు నిలుచున్నా. నిత్యదరిద్రుణ్ణైనా సాయిబాబా నన్ను నిరసించడు... పాపం..!

"గుడ్ మార్ణింగ్ సార్!" నోరంతా తెరచి 'మార్ణింగ్'లో 'ణ'ను నోటి నిండుగా పలికిస్తూ అన్నాడు.

బదులుగా చిరునవ్వు నవ్వి.

"అరపెట్టి సిగరెట్లూ, ఓ కట్టబీడీలూ యివ్వు సాయీ! నిన్ను పాండ్రంగారావు సార్తో మాట్లాడా, చెప్తానన్నాడు మండే నించే వెళ్లొచ్చు నీవు. నెక్స్ మార్చికి డెఫనెట్లీ యూ విల్బీ అగ్రాజుఏట్..." నవ్వుతూ అన్నా.

"థ్యాంక్స్ సార్! ఎట్టజేసైనా యీ సంవత్సరానికి బియ్యే పూర్తి గావాల్సార్. నీకు జూస్తే జెప్పనీకె పుర్సత్తు లేకపాయె..." సిగరెట్లని ఖాళీ రెడ్విల్స్ ప్యాక్‌లో పెట్టియిస్తూ అన్నాడు సాయిబాబా.

వాడికి థ్యాంక్స్ చెప్పి పాల ప్యాకెట్ పట్టుకు నొస్తొంటే. దార్లో పాయిఖానా మెట్లు దిగడానికి ముడ్డి వెనక్కు తిప్పి వేళ్ళ మధ్య ఖాళీ డబ్బా పట్టుకుని, అవిటి కాలిని గాల్లో ఆడిస్తూన్న అమ్మ కనిపించింది. మొహమంతా బిగపట్టి వుంది బాధతో.

మళ్ళీ నన్ను నేను గొంతు పిసుక్కున్నాను.

మొమెంటరీ అంతే... యింకో రెండేళ్లుపోతే... నేను రాయిలా అయిపోతానేమో! అప్పుడెలాంటి దృశ్యమూ నన్ను కదిలించలేదేమో!

తలపక్కకి తిప్పి కాండ్రించినట్టు చేసి గొంతులోని ఖేదాన్ని ఉమ్ములా చేసి తుపుక్కున ఊసా.

యెన్నిసార్లు ఉమ్మినా... అసలు కక్కినా కూడా లోపల చెలమలా బాధ వూరుతూనే ఉంటుంది.

బాధ నన్ను బాధపెట్టడం మానేస్తుందేమో ఆఖరికి కొన్నాళ్ళకి.

నిజమే... బాధ కూడా నిరంతరం కొనసాగితే మొనాటనస్‌గా అయిపోయి నిర్వికారంగా మిగలుతానేమో... అప్పుడసలు సుఖం దార్లో తగిలినా దాన్ని గుర్తించకుండానే సాగిపోతానేమో... యేమో...?

నిజమే...! యిప్పటికే మనసూ శరీరమూ రెండు మొద్దుబారిపోయాయి చావలేము కాబట్టి. చచ్చేవరకూ బ్రతకాలి కాబట్టి... బ్రతుకును వెళ్ళదీస్తూ.

అంతేనా? కాదేమో...!

యేదో మూల రేపు గురించిన చిరు ఆశారేఖ చురుక్కుమనేలా మనసుని గుచ్చుతూ ముందుకు తోలుతుందేమో! యేమో?

పాలప్యాకెట్ని చూసిన అమ్మకంట్లో మెరుపు

కుంటెమ్మ కంటి మెరుపు

కాళ్ళు కడుక్కుంటూ స్టౌవేపు చెయ్యి చూపించింది అమ్మ. దీర్ఘంగా నిట్టూర్చి స్టౌ ముందు కూర్చుని బర్నర్ని వూడబెరికి వత్తులు పైకి చేసి నుసినల్చి బీర్‌సీసాలో కిరసనాయిల్ స్టౌలో నింపి, స్టౌ అంటించి, ఒక బీడీ వెలిగించి, వెళ్ళి కుళాయి దగ్గరున్న

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1802**

* * *

Read other books by Kasibhatla Venugopal @

**http://kinige.com/kbrowse.php?via=author&name=Kasibhatla+Venugopal&id=369**